నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | గురువారం 31 అక్టోబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

విద్యార్థులతో వంట పనులు

కాసిపేట గురుకులంలో వెలుగుచూసిన ఘటన

గురుకులంలో వంటపనులు చేస్తున్న విద్యార్థులు

బెల్లంపల్లి, అక్టోబర్ 30 : మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణ శివారులోని కాసిపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల-కళాశాల విద్యార్థులతో వంట చేయిస్తున్న ఘటన బుధవారం వెలుగు చూసింది. స్వయంగా విద్యార్థులు విద్యార్థి సంఘాల నాయకుల దృష్టికి తీసుకెళ్లడంతో ఈ విషయం బట్టబయలైంది. ప్రతి రోజూ ఒక తరగతి చొప్పున విద్యార్థులు టిఫిన్ చేసి పెట్టాల్సింది సిబ్బంది ఆదేశించినట్లు తెలిసింది. అలాగే భోజన సమయంలో కూడా వంట మాస్టర్లకు సహాయకులుగా వ్యవహరిస్తున్నామని, ప్రతి రోజూ తమతో వంట చేయించడమేగాక బరువైన వంట సామగ్రి మోయిస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఊట్ల సంతోష్‌కుమార్, అసిస్టెంట్ కేర్ టేకర్ వెంకటేశ్‌పై గురుకుల సంక్షేమ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాకు తప్పిన ఏనుగు ముప్పు

ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్లినట్లు గుర్తించిన అధికారులు

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తేతెలంగాణ) : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు ఏనుగు ముప్పు తప్పింది. మహారాష్ట్ర సరిహద్దు గుండా ఛత్తీస్‌గఢ్ వైపు గజరాజు వెళ్లినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. అలాగే కెరమెరి మండలంలోని మహారాష్ట్ర సరిహద్దులో పులి సంచరిస్తున్నదని, దాని పాదముద్రలు గుర్తించామని వారు చెప్పారు. కెరమెరి మండలంలోని అటవీ ప్రాంతం పులులకు ఆవాసంగా ఉండడంతో మహారాష్ట్రలోని తడోబా, తిప్పేశ్వర్ నుంచి ఇక్కడికి వస్తున్నాయన్నారు. ఈ ప్రాంతంలో చిరుతల సంచారం ఎక్కువగా ఉన్నట్లు వారు తెలిపారు. నెలలో 15 నుంచి 20 వరకు ఆవులు, మేకలపై పులి దాడిచేసి చంపినట్లు కేసులు నమోదయ్యాయి. అలాగే కాగజ్‌నగర్ డివిజన్‌లో విద్యుత్ వైర్ పెట్టి అడవి పందిని చంపిన ఘటనలో అశోక్ ఠాకూర్‌తో పాటు మరో ఏడుగురిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

విద్యుత్‌పై బీఆర్ఎస్ విజయం

కరెంటు చార్జీల పెంపునకు చెక్

- సామాన్యులపై భారం పడకూడదనే ఈఆర్‌సీ ఎదుట వాదనలు
- విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన తిరస్కరణ
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం
- పటాకులు కాల్చి.. స్వీట్లు పంచుకుని గులాబీ శ్రేణుల సంబురాలు
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ధూంధాం
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు

మంచిర్యాలటౌన్ : కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు


ఆసిఫాబాద్ టౌన్ : మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

చెన్నూర్ : స్వీట్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

క్రోటపల్లి : స్వీట్లు తినిపించుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

చెన్నూర్ : పటాకులు కాల్చి సంబురాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

కరెంట్ చార్జీలను పెంచాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నానికి బీఆర్ఎస్ చెక్ పెట్టింది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏనాడు విద్యుత్ చార్జీలు పెంచలేదు. కానీ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు గడవకుండానే విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.18,500 కోట్ల భారాన్ని వేయాలని చూసింది. సామాన్యులపై ఈ భారం పడకూడదనే ఉద్దేశంతో బీఆర్ఎస్ పార్టీ ఎలక్ట్రిసిటీ రెగ్యులటరీ కమిషన్(ఈఆర్‌సీ) ఎదుట వాదనలు వినిపించింది. ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ప్రజల పక్షాన నిలబడి 100 శాతం పోరాడింది. బీఆర్ఎస్ వాదనలతో ఏకీభవించిన ఈఆర్‌సీ విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను తిరస్కరించింది. ఈ విజయంపై రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులపాటు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంబురాలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుచ్చారు. ఈ మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. పటాకులు కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంబురాల్లో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. బోథ్ నియోజకవర్గ కేంద్రంలో సంబురాలు జరిగాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు బాంబులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. నిర్మల్, బోథ్, ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

- మంచిర్యాల, అక్టోబర్ 30(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

పత్తి కొనుగోళ్లు ఇంకెప్పుడో..!?

- జిల్లాలో సిద్ధంకాని మార్కెట్ యార్డులు
- సేకరణపై సీసీఐ జాప్యం.. ఆందోళనలో రైతులు
- తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయం

కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని మార్కెట్ యార్డులు, జిన్నింగ్‌లలో సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోవాల్సిన పరిస్థితి దాపురిస్తున్నది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 3 లక్షల 30 వేల ఎకరాల్లో పత్తి సాగవుతుండగా, 23 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు భావిస్తున్నారు. పత్తిలో తేమ శాతం 8 నుంచి 12 శాతం మధ్య ఉండాలి. 8 శాతం తేమ ఉంటే క్వింటాలుకు రూ. 7,521 మద్దతు ధర లభిస్తుంది. 12 శాతానికంటే తేమ శాతం ఎక్కువగా ఉంటే సీసీఐ పత్తిని కొనుగోలు చేయదు. జిల్లాలో వర్షాల ప్రభావం ఉండడంతో సహజంగానే పత్తిలో తేమ శాతం పెరుగుతుంది. ప్రైవేట్ వ్యాపారులు మాత్రం తేమ శాతాన్ని సాకుగా చూపి ధరలు తగ్గిస్తున్నారు. రూ. 6,900 నుంచి రూ. 7,000 వరకు కొనుగోలు చేస్తున్నారు.

సేకరణలో సీసీఐ ఆలస్యం

జిల్లాలోని ఆసిఫాబాద్, జైనూర్, కాగజ్‌నగర్‌లో మార్కెట్ యార్డులు ఉండగా, ఇప్పటికీ కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయలేదు. సీసీఐ సేకరణకు మరో వారం పది రోజులు పట్టే అవకాశమున్నది. ఇప్పటికే పత్తి తీత మొదలైంది. పంట చేతికొస్తున్న సమయంలో కొనుగోళ్లు చేపట్టకుండా ఇలా ఆలస్యం చేయడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా యేటా దసరా తర్వాత పత్తి కొనుగోళ్లు మొదలవుతాయి. కానీ, ఈ ఏడాది దీపావళి వచ్చినా పత్తి కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. ప్రైవేట్ మార్కెట్‌లలో పత్తి ధరలు తగ్గిపోవడంతో రైతులు సీసీఐపైనే ఆశలు పెట్టుకున్నారు. దళారుల ప్రమేయం అధికంగా ఉండే ఆసిఫాబాద్ జిల్లాలో అధికారులు రైతులకు అవగాహన కల్పించి మార్కెట్ యార్డులోనే పత్తి విక్రయించేలా ప్రోత్సహించాల్సి ఉండగా.. వారు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే దళారులు కొనుగోళ్లు ప్రారంభించగా, రైతులు గత్యంతరం లేక వ్యాపారులకే పత్తిని విక్రయించాల్సిన పరిస్థితి వస్తోంది. ఈ ఏడాది కురిసిన అధిక వర్షాల కారణంగా పూత, కాతపై తీవ్రమైన ప్రభావం పడింది. దిగుబడులు సరిగా రాకపోగా.. మరోవైపు చేతికొచ్చిన పంటకు మద్దతు ధర లభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

చేళ్లలో ఏరేందుకు సిద్ధంగా ఉన్న పత్తి

పత్తి ఏరుతున్న రైతులు

మిస్సింగ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 30 : మిస్సింగ్, అసహజ మరణాల కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పూర్తి ఆధారాలతో నేరస్తులకు శిక్షపడేలా చేయాలని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మంచిర్యాల, పెద్దపల్లి జోన్ పరిధిలోని పోలీస్ ఉన్నతాధికారులతో ఆన్‌లైన్ జూమ్ మీటింగ్ ద్వారా పలు పెండింగ్ కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ ఎవరైనా తప్పిపోయినట్లు ఫిర్యాదు వస్తే సత్వరమే కేసు నమోదు చేసి అన్ని పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించాలని ఆదేశించారు. నేరాల నియంత్రణకు 24 గంటలు గస్తీ నిర్వహించాలన్నారు. ప్రజా ఫిర్యాదుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ, ఏసీపీ, సీఐలు పాల్గొన్నారు.

జూమ్ మీటింగ్ ద్వారా సమావేశం నిర్వహిస్తున్న రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

రికార్డులో నమోదు చేయకపోతే ఎలా?

భీమారం, అక్టోబర్ 30 : ఎవరు ఏ డ్యూటీ చేస్తున్నారో రికార్డులో నమోదు చేయకపోతే ఎలా అని రామగుండం సీపీ శ్రీనివాస్ ఎస్ఐ శ్వేతను ప్రశ్నించారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎంత మంది రౌడీ షీటర్లు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు, పోలీస్ స్టేషన్ పరిధిలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సర్కిల్ సీఐ వేణు చందర్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న సీపీ

యూనిఫాంలో ఉండి నిరసనలు చేయొద్దు

హాజీపూర్, అక్టోబర్ 30 : యూనిఫాంలో ఉండి ఎలాంటి నిరసనలు చేపట్టవద్దని రామగుండం సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం గుడిపేట 13వ బెటాలియన్‌లో దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పోలీసు శాఖ ఉన్నత అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. పోలీసు శాఖలో పని చేస్తూ నిబంధనలు అతిక్రమించవద్దని, సమస్యలు ఏమైనా ఉంటే దర్బార్ కార్యక్రమం ద్వారా తెలియజేస్తే ఉన్నతాధికారులకు నివేదికల రూపంలో అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగుల పండుగకు వేళాయె..

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 30 : వెలుగుల పండుగ దీపావళికి వేళయ్యింది. నేడు ఆనందోత్సాహాల నడుమ జరుపుకునేందుకు ప్రజానీకం సిద్ధమైంది. ఈ పండుగ గురించి ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా ఇతిహాసాలు, ఆసక్తికరమైన కారణాలు, రహస్యాలు, కథలు, నమ్మకాలు ఉన్నాయి. నరకాసురుడనే రాక్షస రాజు అనేక మంది యువతుల్ని చెరబట్టి, చిత్రహింసలకు గురిచేసేవాడు. ప్రజలను హింసిస్తూ ఆనందించేవాడు. అతనికి ఎదురే లేకుండా పోవడంతో భక్తజన బాంధవుడు శ్రీకృష్ణుడు నరకాసుర సంహారానికి బయల్దేరుతాడు. ఆ రాక్షస సంహారానికి తానూ తోడుగా వస్తానంటుంది సత్యభామ. ఆమే స్వయంగా రాక్షస సంహారం చేస్తుంది. దీంతో నరకుడి పీడ వదిలిపోవడంతో అప్పటి నుంచి దీపాలు వెలిగించి పండుగ జరుపుకుంటున్నారు. ఇక రావణుడిని సంహరించి శ్రీరాముడు సతీసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చినప్పుడు కూడా ప్రజలు ఆనందోత్సాహాల మధ్య దీపావళిని జరుపుకున్నారని రామాయణం చెబుతున్నది. చీకటిని పారదోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా, విజయానికి ప్రతీకగా దీపావళిని జరుపుకుంటారు. దీపావళి రోజు అమావాస్య కావడంతో చీకటిని పారదోలుతూ ఏటా దీపాలతో తోరణాలు వెలిగిస్తారు. పటాకులు కాల్చుతారు. లక్ష్మీపూజలు, కేదారేశ్వర వ్రతాలు ఆచరించేందుకు ఇండ్లు, వ్యాపార సముదాయలను సిద్ధం చేసుకుంటారు. రంగురంగుల పూలు, విద్యుద్దీపాలతో అందంగా అలంకరించుకుంటారు.

మార్కెట్‌లలో సందడి

దీపావళి పండుగ నేపథ్యంలో బుధవారం మార్కెట్‌లలో సందడి కనిపించింది. ప్రజలు బట్టలు, పూజ సామగ్రి, పూలు, పండ్లు, ప్రమిదలు, పటాకులు, స్వీట్లు.. ఇలా పండుగకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేశారు.